నర్సు

శ్రీ చెరుకుపల్లి వేంకట నృసింహాశాస్త్రి

నర్సుతో వ్యావహారిక కాంగ్లంలో మాటాడడమంటే చాలా ఖుషీగా ఉండేది కొన్నాళ్లు మాకు (అంటే నాకు, మామూర్తికి).

మూర్తి-దాదాపు 25 వత్సరాలు వుంటాయి-అనుకరణబలిసిన మనిషి- సందర్భంలేకుండా, సమయం కాకుండా, matter రాకుండా, అధమపక్షం అరగంటసేపు ఆంగ్లంలో అదలించి వేయగలడు. సూటులో (అంటే, అదిఫుల్ యూరపియన్ సూటుకాదనుకోండి; సగం చిరిగిన స్లిప్పర్లు, ఆముదం మరకలకోటు, కిటికీలచొక్కా-దానికి గుండీలుండవుకూడా-, ఆంగ్లోయిండియన్ స్టైల్ పాంట్- యిత్యాది-) ప్రత్యక్షమైతే, గుడ్‌మార్నింగ్; లాల్చీలో (సైనుగుడ్డలే అనుకోండి- గుండీలు లేనందున కనపడేవక్షో కండగాలను దాచుకొనేందుకు పైనికప్పుకున్న నీలికరల వుత్తరీయం- ఇత్యాది.) ప్రత్యక్షమైతే నమస్తే. మొదటిమాటల్లో యేవడైనా బిల్లరు తింటాడుగాని, కొలదికాలంలోనే అర్థం చేసికోవచ్చు. ఇక మనది సరేననుకోండి, ఎన్ని మార్పులలోనైనా ఒకే తరహా గానడిచేనడక—

ఒకనాడు యిద్దరం హాస్పిటాలులో మా పేషంటుతో మాటాడుతున్నాం. ఒరుగు పరుగుల్లో ప్రవేశించింది నర్సుమేల్ వార్డులోకి. "గుడ్‌మార్నింగ్, మాడమ్," అన్నాడు మావాడు. నేను తలయెత్తి మొగం వంకచూచి వూరుకున్నా. నర్సు మందు తీసికొని పేషంటు దగ్గరకువస్తూ నన్ను తొలగమని చెప్పినట్టుంది నెమ్మదిగా. నేనువినలేదు. మావాడు చేయి పట్టుకొని నన్ను ప్రక్కకుతొలగమన్నట్టు లాగాడు. జరిగాను ప్రక్కనే ఒత్తుకొనిపోయి, మందిచ్చి, త్రాగమంది పేషంటును. వాడేదో అనుమానిస్తున్నాడు, "ఆ చేతి మీదుగా యేమిచ్చినా అమృతమే, త్రాగు" అన్నాడు మామూర్తి, నర్సు నవ్వి వూరుకుంది. "కాని, కొందరిచ్చే అమృతంకూడా, కొందరికి కొన్ని సమయాల్లో విషం కావచ్చు" అన్నానేను. నర్సు నవ్వు తుందనుకున్నా. అలా జరుగలేదు, నా మొగంవంక ఓచూపు విసిరి ఔన్సుగ్లాసుతీసికొని కాంపౌండ్‌లోకి వెళ్ళిపోయింది. ఊళ్ళో సిటీఫ్యాన్సీ మార్టు దగ్గరనుంచీ, బెల్లెడ్, ఫ్రెంచి గవర్నమెంటరి ప్రజెంటేషన్ల వరకూ నావేననే కోతలు గోసేవాడు మూర్తి ఆనర్సుతో. ఇంతలో కన్య కమల (Miss Kamala) వచ్చి గుడ్‌మార్నింగ్ సర్ అంటూ నాతో బాతాఖానీ మొదలెట్టింది. ఆమె కొన్నాళ్లు కవిత్వ విషయాలు తెలిసికొన్నది లెండి నాదగ్గర. నర్సూ, మూర్తీ, మాదగ్గరకు వచ్చారు. కన్యకూ, నర్సుకూ, యేవో చుట్టరికాలున్నాయట. అన్యోన్యం మన్ననలైన తర్వాత నన్ను యెరుకపర్చింది కన్య నర్సు నవ్వలేక నన్నగా నవ్వుతూ తలవంచుకుంది. "కాని, నర్సూ, నీకదిభావ్యంగా లే" దంటూ మానవ మనశాస్త్రం (Human Psychology) కొంత తడివిచెప్పాను. కళ్లువిచ్చి ఓ అరగంటసేపు నలుగురం మాట్లాడాం. తర్వాత కొన్నాళ్లు యిలానే శాస్త్రీయంగా ఏవో కబుర్లుచెప్పి కొనేవాళ్లం.

Reference work కొంచెం యెక్కువగా తగలడంవల్ల వైద్యశాలకు వెళ్లేందుకు తీరలేదు ఒక

వారం. మా హనుమాయమ్మ వచ్చి తినివేసింది రెండో వారం! పదియేను రోజులుగడచినవి.

హాస్పిటల్‌కు వెళ్లాను స్కాటు డ్రెస్సులో. నర్సు నవ్వి యేవేవో తడబడుతూ మాటాడింది. ఎందుకో నాకు అనుమానంవేసి మూర్తి వస్తున్నాడా అంటె నాకేం తెలుస్తుందన్నది. ఈపెన్‌డ్ యెక్కడిదన్నా చేతిలోపెన్ పట్టుకుంటూ. "నాదే, మూర్తి యిచ్చా" డంటూ తొందర పనివున్నట్టు జారిపోయింది. నాకు నవ్వొచ్చింది. సర్వ సహజమైన జాత్య ధర్మానికి వీళ్ళింత భయపడుతారేమా అని. మా మూర్తి కున్నన్ని శకునాలు, అంటే పట్టింపులు యింకోమనిషి కుండవు. ఏడుస్తాడేమోనని హాస్పిటాలు వంకకే పోవటం మానేశాను.

తర్వాత నెలరోజులకు మూర్తివాళ్ల బాబాయి-తన పెన్‌కా జేశాడనీ, పాతికో, ముప్పయ్యోడబ్బు పోయిందనీ-అంటూ కనిపించాడు.

ఆస్పత్రికి పోతే జరీమీద జరీచీరెతో ప్రత్యక్షమైంది నర్సు. మూర్తి యెక్కడ అని అడిగాను. "అతడు చాలా మంచివాడు. ఇక్కడిరౌడీస్ కొట్టవస్తే రాత్రిళ్లుగాని రావడంలేదు" అంటూ తేల్చింది. ఆ అలుసు తీసికొని "ఈచీర యెంతకు కొన్నా" డన్నాను. "పదిన్నర-" అంది పొరపాటున వెంటనే తప్పుకొని "వెంకటేశ్వర్లు కొట్లో కొన్నాను" అంది. "పెన్ కొంచెం యిస్తావా, యిప్పుడే యిస్తా"నని మూర్తి వాళ్ళ బాబాయి చెప్పినగుర్తులు చూచాను.

అతని అవసరం అతణ్ని జారుణ్ని చేసింది. అతని అవసరం అతణ్ని చోరుణ్ని చేసింది. నెలకు యాభై సంపాయిస్తూన్న యీనర్సు కిదేం రోగం?! కావాల్సి వుంటే వాడికే ఓపాతిక యివ్వనలశిందే అనిపించింది.

మాకన్య కమలకు చెప్పితే ఆనర్సును తిట్టిన తిట్లు-తలచుకుంటే కళ్లల్లో మెదుల్తారు నర్సూ, మూర్తీ! సంపాదిస్తున్న నర్సు? అనే మ్రోగుతుంది ప్రతిపదంలో నిత్యం-!



ఫుట్‌బాల్ క్లబ్ (తాసిల్దారుతో:—మీరు మా ఫుట్‌బాల్ క్లబ్బులో సభ్యులుగా చేరాలి.
తాసిల్దార్:—అందుకేమీ ఆక్షేపణలేదు, కాని నన్ను ఆడమంకండి; రిఫరీగా వుంటాను.